

నేటి నుంచి సీలేరు నైట్ బస్సు సర్వీసులు రద్దు

సీలేరు, ఏప్రిల్ 12: మావోయిస్టులు ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు బంద్‌కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈ నెల 16 వరకు సీలేరు మీదుగా తిరిగే నైట్ బస్సు సర్వీసులను రద్దు చేసినట్టు పీటీడీ అధికారులు తెలిపారు. నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సీలేరు మీదుగా విశాఖపట్నం నుంచి భద్రాచలం, అలాగే భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే నైట్ సర్వీసులను, సీలేరు- విశాఖపట్నం నైట్ హాల్ట్‌ను రద్దు చేశామన్నారు. అయితే ఉదయం తిరిగే సర్వీసులు యథావిధిగా నడుస్తాయన్నారు.

ఇంటర్ ఫలితాలు నిరాశాజనకం

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ తొలి ఏడాది 48 శాతం, రెండో ఏడాది 70 శాతం ఉత్తీర్ణత

- అరకులోయలో ఉత్తీర్ణత 8.5 శాతం మాత్రమే
- సీలేరులోనూ అంతంతమాత్రమే
- మన్యంలో పూర్తి స్థాయిలో మెరుగుపడని ఇంటర్ విద్య
- ఫలితాలు వచ్చిన రోజూ తెరుచుకోని జిల్లా ఇంటర్ విద్యాశాఖ కార్యాలయం

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు నిరాశాజనకంగా వచ్చాయి. అరకులోయ, సీలేరు కాలేజీల్లో ఉత్తీర్ణతా శాతం తక్కువ వచ్చింది. అలాగే తొలి ఏడాది ఇంటర్ ఫలితాలు జి.మాడుగుల, అనంతగిరి, ముంచంగిపుట్టు జూనియర్ కాలేజీల్లో ఫలితాలు ఆశాజనకంగానే వచ్చాయి.



ఉత్తీర్ణత శాతం తక్కువ ఉన్న అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాల

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి(జనరల్) సంవత్సరంలో 5,623 మందికి 2689 మంది పాస్ కాగా ఉత్తీర్ణత శాతం 48, అలాగే రెండో ఏడాది(జనరల్) 4,542 మందికి 3172 మంది పాస్‌కాగా, ఉత్తీర్ణత 70 శాతంగా నమోదైంది. ఒకేషన్ విద్యార్థులు తొలి ఏడాది 1150 మందికి 685 మంది పాస్‌కాగా 60 శాతం, రెండో ఏడాది 961 మందికి 740 మంది పాస్ కాగా 77 శాతంగా నమోదైంది. అరకులోయలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 222 మందికి 19 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించగా, ఉత్తీర్ణత శాతం 8.5గా నమోదైంది. అలాగే సీలేరులో తొలి ఏడాది 44 మందికి 9 మంది పాస్‌కాగా 20 శాతం ఉత్తీర్ణత, హుకుంపేటలో తొలి ఏడాది 229 మందికి 50 మంది పాస్‌కాగా 21.8 శాతం ఉత్తీర్ణత వచ్చింది. జి.మాడుగులలో మాత్రం మొదటి, రెండో సంవత్సర ఫలితాలు ఆశాజనకంగా రావడం విశేషం. తొలి ఏడాది 307 మందికి 250 మంది పాస్‌కాగా 81 శాతం, రెండో ఏడాది 197 మందికి 177 మంది పాసై 89.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా చూస్తే మాత్రం ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవనే చెప్పాలి.



పాడేరులో శుక్రవారం తాళం వేసి వున్న జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయం

మెరుగుపడని ఇంటర్ విద్య

పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లవుతున్నా ఏజెన్సీలోని ఇంటర్ విద్యావ్యవస్థ మాత్రం మచ్చుకైనా మెరుగుపడలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా లేదా రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఇంటర్ విద్యను పర్యవేక్షించే పరిస్థితి సంపూర్ణంగా లేదు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని సమస్యలు, ఇతర ఇబ్బందులను చెప్పుకోవడానికి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సైతం ఇక్కడ లేరు. దీంతో గిరిజన ప్రాంతంలో ఇంటర్ విద్యావ్యవస్థ మెరుగుపడే అవకాశమే లేకుండా పోయింది. అలాగే ఏజెన్సీలో అనేక జూనియర్ కళాశాలల్లో బోధనేతర సిబ్బంది లేకపోవడంతో ఆయా పనులు అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు నిర్వహిస్తున్నారు. దీంతో వారంతా బోధనపై దృష్టిపెట్టలేని పరిస్థితి కొనసాగుతున్నది. ఉదాహరణకు ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బోధనేతర సిబ్బంది ఒక్కరూ లేరు. ఇలా ఏజెన్సీలో వ్యాప్తంగా అనేక కళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది లేని దుస్థితి నెలకొంది. ఈ పరిణామాలతో ఏజెన్సీలో ఇంటర్‌లో చక్కని ఫలితాలు ఆశించడం తప్పే అవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మన్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరిస్థితులను మెరుగుపరిచి గిరిజన విద్యార్థులకు చక్కని ఇంటర్ విద్యను అందించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

మన్యంలో మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాల వివరాలు

మండలం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
అనంతగిరి	133	92	69.1
డుంబ్రిగుడ	192	67	34.9
అరకులోయ	222	19	8.5
ముంచంగిపుట్టు	232	108	46.3
హుకుంపేట	229	50	21.8
పాడేరు	301	96	31.8
జి.మాడుగుల	307	250	81.4
చింతపల్లి	193	95	49.2
సీలేరు	44	9	20.4

మన్యంలో రెండో సంవత్సరం ఇంటర్ ఫలితాల వివరాలు

మండలం	మొత్తం విద్యార్థులు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
అనంతగిరి	91	77	84.6
డుంబ్రిగుడ	106	80	75.4
అరకులోయ	179	63	36.2
ముంచంగిపుట్టు	137	119	86.8
హుకుంపేట	211	154	72.9
పాడేరు	287	182	63.4
జి.మాడుగుల	197	177	89.8
చింతపల్లి	224	171	76.3
సీలేరు	31	11	35.4

ఫలితాల రోజు తెరుచుకోని కార్యాలయం

ఇతర రోజుల్లో ఎలా ఉన్నా ఇంటర్ ఫలితాలు విడుదలయ్యే రోజు సంబంధిత కార్యాలయం తెరచుకోవడం సహజం. కానీ స్థానిక జిల్లా ఇంటర్ విద్యా కార్యాలయం మాత్రం అందుకు భిన్నంగా ఫలితాలు విడుదలైన శుక్రవారం రోజు సైతం తాళం వేసి ఉంది. ఇంటర్ విద్యాధికారులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు ఇతర ప్రాంతాల్లో చేసిన తప్పులకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా పాడేరులో పోస్టింగ్ ఇవ్వడంతో ఇదే అదనుగా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారులు, సిబ్బంది తమ పనులను ఆన్‌లైన్ లేదా వాట్సాప్‌లో చేసుకోవడంతో కార్యాలయానికి రాని పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు.

మావోయిస్టు సిద్ధాంతాలతో ప్రయోజనం శూన్యం

- ఆత్మీయ సమ్మేళనంలో ఎస్పీ తుహిన్‌సిన్హా



మాజీ మావోయిస్టులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అవలంబిస్తున్న సిద్ధాంతాలతో ప్రజా జీవనానికి నష్టమేగాని ఎటువంటి ప్రయోజనం లేదని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. ఏజెన్సీలో వివిధ మావోయిస్టు పార్టీకి చెందిన దళాల్లో పని చేసి ప్రస్తుతం జనజీవన స్రవంతిలో కలిసి జీవనం సాగిస్తున్న 86 మంది మాజీ మావోయిస్టులతో శుక్రవారం ఇక్కడ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టుల చర్యలతో ఏజెన్సీలో విధ్వంసం, గిరిజనుల జీవితాలు నాశనం కావడం మినహా ఎటువంటి మేలు జరగలేదన్నారు. మావోయిస్టు పార్టీలో ఉంటే ఎటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయో? జనజీవ స్రవంతిలోకి వస్తే ఎలా ఉంటుందో తెలుసుకునే అనేక మంది పార్టీని వీడి ప్రస్తుతం స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. ఇప్పటికీ అరకొరగా వున్న మావోయిస్టులు, వారి సానుభూతిపరులు తమకు లొంగిపోయి, చక్కని పునరావసం పొందాలని ఎస్పీ కోరారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులు గ్రామాల్లోకి వస్తే ఎవరూ సహకరించవద్దని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టుల యోగక్షేమాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి వంటపాత్రలను పంపిణీ చేసి, వారితో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు హిమగిరి, సుధాకర్, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

తగ్గని ఎండ తీవ్రత

- కొయ్యూరులో అత్యధికంగా 37.2 డిగ్రీలు నమోదు

పాడేరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మన్యంలో ఎండ తీవ్రత కొనసాగుతున్నది. దీంతో కొయ్యూరులో శుక్రవారం 37.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీలో సైతం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై తొమ్మిది గంటల తరువాత నుంచి దాని తీవ్రత అధికమవుతున్నది. మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై సంచరించేందుకు జనం ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎండ ప్రభావం తగ్గుతున్నప్పటికీ ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నది. తాజా వేడి వాతావరణానికి ఏజెన్సీ వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం అనంతగిరిలో 31.9 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అరకులోయలో 34.0, చింతపల్లిలో 34.6, డుంబ్రిగుడలో 32.6, జీకేవీధిలో 33.7, జి.మాడుగులలో 33.8, హుకుంపేటలో 32.7, ముంచంగిపుట్టులో 31.5, పాడేరులో 34.0, పెదబయలులో 31.5 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గర్భిణులకు వైద్య సేవలు అంతంత మాత్రమే..

- చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో పేరుకు ముగ్గురు స్త్రీ వైద్య నిపుణులు
- అందుబాటులో ఉండేది ఒక్కరే
- సెలవు పెడితే వైద్య సేవలు బంద్
- గర్భిణులకు తప్పని అవస్థలు



అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న గర్భిణులు

చింతపల్లి, ఏప్రిల్ 12:

స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. రికార్డుల ప్రకారం ముగ్గురు స్త్రీ వైద్యనిపుణులు ఉండగా, ఇక్కడ ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఆ వైద్యనిపుణురాలు కూడా సెలవు పెడితే గర్భిణులకు సేవలు నిలిచిపోతున్నాయి. గర్భిణులకు ప్రసవం కష్టమై సిజేరియన్ అవసరమైతే 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించాల్సి దుస్థితి నెలకొంది.

స్థానిక ఏరియా ఆస్పత్రికి చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతలు చికిత్స కోసం వస్తుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి గర్భిణులను ప్రసవం కోసం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. కొంత మంది నేరుగా ప్రసవం కోసం ఆస్పత్రికి వస్తున్నారు. దీంతో పాటు ప్రతి రోజు 50 నుంచి 100 మంది గర్భిణులు ఆరోగ్య తనిఖీల కోసం వస్తున్నారు. అలాగే శివారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలైన సీలేరు, ధారకొండ, పెదవలస, జీకేవీధి, కోరుకొండ, తాజంగితో పాటు ఇతర పీహెచ్‌సీల నుంచి గర్భిణులు అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. ప్రతి నెల 9, 10 తేదీల్లో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంలో గర్భిణులకు ఇక్కడ ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఆస్పత్రిలో కేవలం ఒకే ఒక్క స్త్రీ వైద్యనిపుణురాలు అందుబాటులో ఉండడంతో పని భారం పెరిగిపోయింది. గర్భిణులు, బాలింతలకు సైతం ఏరియా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదు.

నిలిచిపోయిన సిజేరియన్‌లు

ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ప్రసవాలు నిలిచిపోయాయి. గత ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన నాటి కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెడికల్ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా ఆస్పత్రి స్త్రీ వైద్యనిపుణుడు తమర్బ నరసింగరావుతో కలిసి స్థానిక ఏరియా ఆస్పత్రిలో సిజేరియన్ ప్రసవాలను ప్రారంభించారు. నాలుగు నెలల పాటు సిజేరియన్ ప్రసవాలు ఆస్పత్రిలో జరిగాయి. అనంతరం మత్తు వైద్యాధికారి ఉద్యోగానికి రాజీనామా చేయడం, ఇద్దరు స్త్రీ వైద్యనిపుణుల్లో ఒకరు పదోన్నతిపై కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు వెళ్లిపోవడంతో సిజేరియన్ ప్రసవాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం మత్తు వైద్యాధికారి అందుబాటులో ఉన్నప్పటికి కేవలం ఒక స్త్రీ వైద్యనిపుణురాలు మాత్రమే ఉండడం వల్ల సిజేరియన్ ప్రసవాలు చేయడం లేదు. గర్భిణులకు ... మిగతా 8వ పేజీలో

సాగునీటి కల్పనలోనూ నిర్లక్ష్యం

- వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న చెక్‌డ్యామ్‌లు 1,214
- మరమ్మతులకు గురైనవి 591 పైనే..
- గిరిజన రైతుల గగ్గోలు

కనీస మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యామ్‌లు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలోని పంట భూములకు సాగునీరందించే విషయంలోనూ వైసీపీ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన ప్రాంతంలో చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు.



కనీస మరమ్మతులకు నోచుకోని పాడేరు మండలం లగిశపల్లి ప్రాంతంలోని చెక్‌డ్యామ్

ఏజెన్సీ వ్యాప్తంగా 1,214 చెక్‌డ్యామ్‌లున్నాయి. వాటి కింద 62,448 ఎకరాల ఆయకట్టు ఉంది. దీంతో సుమారుగా 30 వేల మంది గిరిజన రైతుల పంట భూములకు సాగునీటి సదుపాయం సమకూరుతున్నది. అయితే నిత్యం నీటి ప్రవాహం తాకిడి కారణంగా ప్రతి ఏడాది చెక్‌డ్యామ్‌లు మరమ్మతులకు గురికావడం, చెక్‌డ్యామ్ గర్భంలో పూడిక పేరుకుపోవడం, చెక్ డ్యామ్ నుంచి పంట పొలాలకు నీరు మళ్లించే చానళ్లు మరమ్మతులకు గురికావడం జరుగుతుంది. దీంతో ప్రతి ఏడాది వేసవిలో మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్‌లను గుర్తించి వాటికి అవసరమైన మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలను చిన్ననీటి పారుదల శాఖ అధికారులు రూపొందిస్తారు. అధికారులు రూపొందించిన ఆ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తే, అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఆయా నిధులతో ఖరీఫ్ సాగుకు ముందే అవసరమైన మరమ్మతులు చేపట్టి చెక్‌డ్యామ్‌లను అందుబాటులోకి తీసుకువస్తారు.

మన్యంలోని మొత్తం చెక్‌డ్యామ్‌లు, వాటి కింద ఆయకట్టు వివరాలు

మండలం	చెక్‌డ్యామ్‌లు	ఆయకట్టు (ఎకరాల్లో..)
కొయ్యూరు	144	10,492
చింతపల్లి	93	8,260
జీకేవీధి	63	3,486
జి.మాడుగుల	80	4,495
పాడేరు	98	5207
హుకుంపేట	95	4,814
పెదబయలు	104	3,754
ముంచంగిపుట్టు	82	3,460
డుంబ్రిగుడ	85	3,877
అరకులోయ	167	7,179
అనంతగిరి	203	7,064
మొత్తం	1,214	62,448



సాగునీటి సదుపాయం లేక రెండో పంట వేయని పొలాలు

చెక్‌డ్యామ్‌ల వైపు కన్నెత్తి చూడని దుస్థితి

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏజెన్సీలో చెక్‌డ్యామ్‌ల బాగోగులను చూసే పరిస్థితే లేకుండాపోయింది. దీంతో గత నాలుగున్నరేళ్లుగా మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్‌లను బాగుచేయించని దుస్థితి కొనసాగుతున్నది. చిన్ననీటి పారుదల శాఖకు నిధులు విడుదల చేయకుండా, ఆ శాఖలోని ఇంజనీర్లను పని లేకుండా ప్రభుత్వం చేసేసింది. దీంతో ఏజెన్సీలోని చిన్న నీటిపారుదల శాఖకు చెందిన డీఈఈలు, ఏఈఈలను, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించేందుకు వినియోగించుకుంటున్నారు. ఫలితంగా ఏజెన్సీలో చిన్న నీటి పారుదల శాఖకు చెందిన ఇంజనీర్లు చెక్‌డ్యామ్‌ల వైపు కన్నెత్తి చూసే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఏజెన్సీ 11 మండలాల్లో 591 పైబడి చెక్‌డ్యామ్‌లు వివిధ స్థాయిల్లో మరమ్మతులకు గురయ్యాయని, వాటికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని గతంలోనే చిన్న నీటి పారుదల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ దానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. దీంతో మరమ్మతులకు గురైన చెక్‌డ్యామ్‌లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తుండగా, వాటి కిందన ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు అందని దుస్థితి కొనసాగుతున్నది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యామ్‌లకు మహర్దశ

ఏజెన్సీలోని గిరిజన రైతుల సాగు భూములకు నీటిని అందించే విషయంలో గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచిందని రైతులు అంటున్నారు. ప్రతి ఏడాది ఎంపిక చేసిన ... మిగతా 8వ పేజీలో

శ్రమదానంతో రహదారి నిర్మాణం

- ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో కదలిన గిరిజనం

డుంబ్రిగుడ, ఏప్రిల్ 12: రహదారి అధ్వానంగా ఉండి రాకపోకలకు వీలు లేకుండా ఉండడంతో మండలంలోని పోతంగి పంచాయతీ బిజుమరవలస గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కా రహదారి నిర్మించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో శుక్రవారం గ్రామస్థులు శ్రమదానం చేసి రహదారిపై ఉన్న గోతులను మట్టితో పూడ్చి చదును చేసుకున్నారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామానికి పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రహదారిని శ్రమదానంతో బాగు చేసుకుంటున్న గ్రామస్థులు

క్రైం... crime news

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కంచుమర్తి సూర్యనారాయణ మూర్తి (ఫైల్)

సబ్బవరం, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో ఎస్‌బీఐ వద్ద గురువారం ఉదయం బైక్ ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన కంచుమర్తి సూర్యనారాయణమూర్తి (60) తాపీమేస్త్రీ. అతను గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో మూడు రోడ్ల కూడలి నుంచి అనకాపల్లి రోడ్డులో గల ఎస్‌బీఐ వద్దకు స్కూటీపై వెళ్లి తిరిగి వెనక్కి వస్తుండగా బైక్ ఢీకొనడంతో గాయపడ్డారు. గాయపడిన అతడిని బంధువులు, కుటుంబ సభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. గురువారం రాత్రి మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రెండు గ్రామాల్లో అగ్నిప్రమాదాలు

- జన్నవరం కొత్తూరులో 12 పశువుల పాకలు, వరికుప్పలు దగ్ధం
- 30 మేకలు, కోళ్లు మృతి
- రూ.30 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమంటున్న అధికారులు
- జి.జగన్నాథపురంలో ఆరు వరి కుప్పలు ఆహుతి



జన్నవరం కొత్తూరులో కాలిపోతున్న వరికుప్పలు

చోడవరం, ఏప్రిల్ 12: మండలంలోని రెండు గ్రామాల్లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.32 లక్షల వరకూ ఆస్తినష్టం సంభవించింది. జన్నవరం కొత్తూరు గ్రామంలో మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో 12మంది రైతులకు చెందిన పశువుల పాకలు, వరి కుప్పలతో పాటు, 30మేకలు, కోళ్ల అగ్నికి ఆహుతయ్యాయి. తుల్లు సిమ్మన్న అనే రైతు పాక వద్ద తొలుత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. అదే సమయంలో గాలులు వీచడంతో మంటలు ఆ పక్కనే ఉన్న ఇతర పశువుల పాకలు ఒకదాని తరువాత ఒకటిగా అంటుకున్నాయి. గ్రామస్తులు అప్రమత్తమై ఇతర పాకలకు మంటలు పాకకుండా ఆర్పివేశారు. ఈలోగా సమాచారం అందుకున్న అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి నరసింగరావు ఆధ్వర్యంలో రెండు వాహనాలతో సిబ్బంది అక్కడి చేరుకుని మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో తుల్లు సిమ్మన్న, అక్కమ్మ, ఈశ్వరరావు, చంటిబాబు, పెద అప్పారావు, దేముడు, సురేష్, చిన అప్పారావు, చిట్టిబాబు, బాబూరావు, రాజు, వెంకయ్యమ్మలకు చెందిన పశువుల పాకలతో పాటు, పాకల్లో ఉన్న 20 పెద్ద మేకలు, 10 మేక పిల్లలు, 50 కోళ్ల అగ్నికి ఆహుతయ్యాయి. పండించిన వరి కుప్పలు కూడా పాకల్లోనే ఉండడంతో అవి కూడా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం 20లక్షలుగా అధికారుల అంచనాల వేసినప్పటికీ, రూ.30 లక్షలకు పైబడి ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు. బాధితులను విప్ ధర్మశ్రీతో పాటు టీడీపీకి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీ శంకర్ తదితరులు వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. ఇదిలావుంటే, జి.జగన్నాథపురంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన మరో అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఆరుగురు రైతుల వరి కుప్పలు దగ్ధమయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్షా 50వేలు ఉంటుందని అంచనా. ఈ సమాచారం తెలుసుకున్న చోడవరం అగ్నిమాపక శాఖ అధికారి జీవీ రామస్వామి, లీడింగ్ ఫైర్‌మేన్ కె.రాము, సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు.

12 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: పట్టణంలో శుక్రవారం ఒక వ్యక్తి నుంచి 12 క్వార్టర్ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం గ్రామానికి చెందిన మోదినాయుడు మద్యంతో పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

జాలర్ల వలలో భారీ తిమింగలం



అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని తంతడి-ఓడపాలెం సముద్ర తీరం నుంచి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలో భారీ చేప పడింది. దీనిని వారు ఒడ్డు వరకూ లాగారు. తీరా ఒడ్డుకు చేరాక పరిశీలిస్తే.. అది తిమింగలంగా గుర్తించారు. ఈ భారీ తిమింగలంగా గుర్తించారు. ఇది సుమారు 30 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు ఉందని మత్స్యకారులు తెలిపారు. ఈ తిమింగలం కదలకపోవడంతో మత్స్యకారులు తమ వలలను తొలగించి సముద్రంలోకి పంపించే ప్రయత్నాలు చేసినప్పటికీ వెళ్లలేదు. చనిపోయిన తిమింగలం వలలో పడిందని జాలర్లు తెలిపారు.

విశాఖ-కొల్లాం ప్రత్యేక వారాంతపు రైలు

- దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 12: వేసవి రద్దీని దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, కొల్లాం మధ్య ప్రత్యేక వారాంతపు రైలుతోపాటు వయా విశాఖ, దువ్వాడ మీదుగా మరికొన్ని ప్రత్యేక వారాంతపు రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08539 నంబరు గల రైలు ఈనెల 17 నుంచి జూలై 3వతేదీ వరకు ప్రతి బుధవారం ఉదయం 8.20 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లాం చేరుతుంది. తిరిగి ఈనెల 18 నుంచి జూలై 4వతేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 7.35 గంటలకు కొల్లాంలో బయలుదేరి మర్నాడు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుతుంది.

న్యూ టిన్సుకియా-బెంగళూరు-న్యూ టిన్సుకియా వయా విశాఖ

05952 నంబరు గల రైలు మే రెండు జూన్ 27 వరకు ప్రతి గురువారం సాయంత్రం 6.45 గంటలకు న్యూ టిన్సుకియాలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ, మర్నాడు (మూడోరోజు) ఉదయం 9.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి మే ఆరు నుంచి జూలై ఒకటో తేదీ వరకు ప్రతి సోమవారం ఉదయం 00.30 (ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు) ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు రాత్రి 9.40 గంటలకు విశాఖ, బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు న్యూ టిన్సుకియా చేరుతుంది.

భువనేశ్వర్-యలహంక-భువనేశ్వర్ వయా దువ్వాడ

02811 నంబరు గల ప్రత్యేక ఏసీ రైలు ఈనెల 13 నుంచి మే 25 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 1.53 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 11.55 గంటలకు యలహంక చేరుతుంది. తిరిగి ఈ రైలు ఈనెల 15 నుంచి మే 27 వరకు ప్రతి సోమవారం ఉదయం 5.00 గంటలకు మర్నాడు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. ఈ సర్వీసులు 16 థర్డ్ ఏసీ కోచ్‌లతో కుర్దారోడ్డు, బ్రహ్మపూర్, పలాస, శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం, కొత్తవలస, దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, నంద్యాల, ధోనే, ధర్మవరం, సత్యసాయి ప్రశాంతి నిలయం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

హౌరా-యశ్వంతపూర్-హౌరా వయా దువ్వాడ

02863 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 18 నుంచి జూన్ 27 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 2.43 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 (తెల్లవారితే శనివారం) గంటలకు యశ్వంతపూర్ చేరుతుంది. తిరిగి ఈనెల 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి అర్ధరాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మర్నాడు (ఆదివారం) మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	411
విజయనగరం	415
శ్రీకాకుళం	415

ఇంటర్‌లో అదరగొట్టారు

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉమ్మడి అనకాపల్లి జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించి అదరహో అనిపించారు. వారిలో పలువురు విద్యార్థులను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా తమ భవిష్యత్తు లక్ష్యాలను వివరించారు.

ప్రథమ సంవత్సరం

డాక్టర్ అవుతా...



పేరు: డీవీఎస్. సాయి నిహారిక
మార్కులు: 470/464,
గ్రూపు : ఎంపీసీ
ఊరు : తుని
కళాశాల : శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, పాయకరావుపేట
తండ్రి పేరు : డీ.సత్యనారాయణమూర్తి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు
తల్లి పేరు : వెంకట సీత సత్యవతి, గృహిణి
లక్ష్యం : ఐఐటీలో బీ.టెక్ ఇంజనీరింగ్ చదువుతాను. భవిష్యత్‌లో ఇంజనీరుగా ఉన్నత స్థానాన్ని సాధించాలనుకుంటున్నాను.

మెడిసిన్ చేయాలని లక్ష్యం



విద్యార్థి పేరు : యు.ప్రణతి
కళాశాల : రిషి కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : బైపీసీ మొదటి సంవత్సరం 434/440
తల్లిదండ్రులు : యు.ప్రసాద్, స్వరూపారాణి (తండ్రి చర్చి పాస్టర్, తల్లి గృహిణి)
లక్ష్యం : మెడిసిన్ చేయాలని లక్ష్యం

ఐఐటీ పూర్తి చేయడమే లక్ష్యం



పేరు : మాదేటి దివ్య సంస్కృతి
మార్కులు : 470/461
గ్రూపు: ఎంపీసీ, మొదటి సంవత్సరం
ఊరు : తుమ్మపాల, అనకాపల్లి మండలం
కళాశాల : సుభిక్ష కాలేజి, కూర్మన్నపాలెం
తండ్రి : మాదేటి రామచంద్రమూర్తి, వ్యాపారి
తల్లి : నాగలక్ష్మి, గృహిణి
లక్ష్యం : ఐఐటీ పూర్తి చేయడమే లక్ష్యం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



పేరు : పి.సుప్రియ
గ్రూపు : ఎంపీసీ
మార్కులు : 465/470
ఊరు : కోనేపాలెం, అచ్యుతాపురం మండలం
కాలేజీ : కైట్స్ జూనియర్ కాలేజీ
తండ్రి : పి.శ్రీను (లారీ డ్రైవర్)
తల్లి : అపర్ణ (టైలరింగ్)
లక్ష్యం : సాఫ్‌వేర్ ఇంజనీర్

ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

విద్యార్థి పేరు : బి. సాయిలక్ష్మిదీప్తి
కళాశాల : శ్రీప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 465/470
తల్లిదండ్రులు : బి. రమేశ్‌కుమార్, రామలక్ష్మి (తండ్రి ఆర్టీసీ డ్రైవర్, తల్లి గృహిణి)
లక్ష్యం : ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : కె.దుర్గాగాయత్రి
కళాశాల : రిషి కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 464/470
తల్లిదండ్రులు : కె.లోవరాజు, సుజాత (వ్యవసాయం)
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

సివిల్స్ సాధించడం లక్ష్యం

పేరు : పంచదార్ల మహాలక్ష్మి
మార్కులు : 470/466
గ్రూపు: ఎంపీసీ, మొదటి సంవత్సరం
ఊరు : తుమ్మపాల, అనకాపల్లి మండలం
కళాశాల : నారాయణ కాలేజి, బోయపాలెం
తండ్రి : పంచదార్ల కన్నారావు, ఎంపీటీసీ, తుమ్మపాల
తల్లి : పంచదార్ల వెంకటలక్ష్మి, గృహిణి
లక్ష్యం : సివిల్స్ సాధించడం లక్ష్యం

ద్వితీయ సంవత్సరం

మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలి



పేరు : టి.వెన్నెల
మార్కులు : 1000/982,
గ్రూపు : ఎంపీసీ ఊరు : తుని
కళాశాల : శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, పాయకరావుపేట
తండ్రి పేరు : టి.గోపాలకృష్ణ, ఎల్ఐసీ.ఏజెంటు
తల్లి పేరు : జయలక్ష్మి, గృహిణి
లక్ష్యం : ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు సాధించి ఇంజనీరింగ్ చదువుతాను. భవిష్యత్‌లో మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలను కుంటున్నాను.

మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలి



విద్యార్థి పేరు : కె.జ్యోతి ఐశ్వర్యలక్ష్మి
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ 986/1000
తల్లిదండ్రులు : కె.జగదీశ్, సౌమ్య (తండ్రి వ్యాపారి, తల్లి గృహిణి)
లక్ష్యం : లాయర్ అవ్వాలని లక్ష్యం

బిఫార్మసీ లక్ష్యం



విద్యార్థి పేరు : కె.శ్రావణి
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : బైపీసీ 986/1000
తల్లిదండ్రులు : కె. కళ్యాణం, రాజేశ్వరి (తండ్రి సేల్స్‌మేన్, తల్లి గృహిణి)
లక్ష్యం : బిఫార్మసీ లక్ష్యం

సివిల్స్‌కు వెళ్లాలనే కోరిక

పేరు : కె. దిలీప్‌కుమార్
మార్కులు : 1000/989
గ్రూపు: ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం
ఊరు : బంగారయ్యపేట, కశింకోట మండలం
కళాశాల : హిమశేఖర్ జూనియర్ కళాశాల
తండ్రి : కె. గణపతిరావు, ప్రైవేటు సెక్యూరిటీ విభాగంలో ఆపరేషన్ మేనేజర్
తల్లి : హిమబిందు, గృహిణి
లక్ష్యం : ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించాలని ఉంది. అలాగే సివిల్స్‌కు వెళ్లాలనే కోరిక ఉంది

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : సీహెచ్.కోటి లోక్ తేజ
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు: ఎంపీసీ 989/1000
తల్లిదండ్రులు : సీహెచ్ వెంకటరమణ, సూర్యకుమారి (తండ్రి ఎల్ఐసీ ఏజెంట్, తల్లి గృహిణి)
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

ఇంజనీర్ అవుతా..



విద్యార్థి పేరు : ఎం.నవ్య
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ 983/1000
తల్లిదండ్రులు : ఎం.వీర్రాజు, భవాని (తండ్రి రైతు, తల్లి టైలరింగ్)
లక్ష్యం : ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

ప్రథమ సంవత్సరం

ఇంజనీర్ అవుతా..

విద్యార్థి పేరు : కె. త్రిపురాదేవి
కళాశాల : శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 463/470
తల్లిదండ్రులు : కె. నూకరాజు, మహాలక్ష్మి (తండ్రి రైతు, తల్లి గృహిణి)
లక్ష్యం : ఇంజనీర్ అవ్వాలని లక్ష్యం

మెడిసిన్ చేయాలని లక్ష్యం



విద్యార్థి పేరు : కె.యమున
కళాశాల : శ్రీ విద్య జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : బైపీసీ 433/440
తల్లిదండ్రులు : కె.శ్రీనివాస్, దుర్గ (తండ్రి కూలి, తల్లి గృహిణి)
లక్ష్యం : మెడిసిన్ చేయాలని లక్ష్యం

మెడిసిన్ చేయాలని లక్ష్యం



విద్యార్థి పేరు : ఎస్ ప్రేమవర్షిత
కళాశాల : శ్రీ విద్య జూనియర్ కళాశాల, నర్సీపట్నం
గ్రూపు/ మార్కులు : ఎంపీసీ మొదటి సంవత్సరం 460/470
తల్లిదండ్రులు : ఎస్ ప్రసాద్, ధనలక్ష్మి (ఉపాధ్యాయులు)
లక్ష్యం : ఐఐటీలో ర్యాంక్ సాధించాలని లక్ష్యం

అనకాపల్లి మార్కెట్ కమిటీలో ఉద్యోగుల కొరత

- 34 మందికి నలుగురే రెగ్యులర్ ఉద్యోగులు
- భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నవారిపై అదనపు పనిభారం



మార్కెట్ కమిటీ కార్యాలయం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: ఉత్తరాంధ్రలో గుర్తింపు పొందిన అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉద్యోగుల కొరత వేధిస్తున్నది. ఉన్న వారిపై పనిభారం అధికమవ్వడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ కమిటీలో ఉద్యోగులు మొత్తం 34 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా.. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, యూడీసీ, సూపర్‌వైజర్, అసిస్టెంట్ సెక్రటరీలు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు విధులను నిర్వహిస్తున్నారు. మిగతా 30 మంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్యదర్శి గ్రేడు-2 ఒకటి, డీఈ, ఏఈ, సూపర్‌వైజర్లు-2, ఎల్‌డీసీలు-4, టైపిస్ట్ -1, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు -4, డ్రైవర్ -1, వాచ్‌మెన్‌లు -10, అటెండర్లు -3, సహాయ మార్కెట్ సూపర్‌వైజర్లు -2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 18 మంది ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 12 మంది సెక్యూరిటీ గార్డులు, ఐదుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఒకరు ఎలక్ట్రీషియన్ ఉన్నారు. అయితే మార్కెట్ జూనియర్ సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో ఉన్న వారు నిత్యం మార్కెట్‌యార్డులో బెల్లం అమ్మకాలు జరిగేటప్పుడు పరిశీలన చేసి అమ్మకాల ధరలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రస్తుతం డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్న సిబ్బందే ఈ విధులను నిర్వహించడంతో వారిపై పని భారం అధికమైంది.

కమిటీలో పనిచేసే ఉద్యోగులు పదవీవిరమణ చేసినా, ఇతర కమిటీలకు బదిలీ అయిన వారి స్థానాల్లో నియామకాలు చేయడం లేదు. మొత్తం 34 మంది ఉద్యోగులు కమిటీ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉండగా రెగ్యులర్ ఉద్యోగులు నలుగురు, ఔట్‌సోర్సింగ్‌లో 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో 12 ఖాళీగా ఉన్నాయి. ఈ విషయమై సెక్రటరీ శకుంతలను వివరణ కోరగా.. పోస్టుల విషయమై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతున్నామన్నారు. అలాగే ప్రతిపాదనలు కూడా పంపుతున్నట్టు ఆమె చెప్పారు.

మాడుగుల శివారులో గిరినాగు

- కళ్లాల వద్ద బుసలు కొడుతూ కనిపించిన పన్నెండు అడుగుల పాము
- చాకచక్యంగా పట్టుకుని దూరంగా విడిచిపెట్టి స్నేక్ క్యాచర్



గిరినాగును ప్రాణాలతో పట్టుకున్న స్నేక్ క్యాచర్ వెంకటేశ్

మాడుగుల, ఏప్రిల్ 12: మండల కేంద్రం మాడుగుల శివారు రామచంద్రపురం వెళ్లే దారిలో గల తుమ్మగంటి వారి కళ్లాల వద్ద శుక్రవారం ఉదయం పన్నెండు అడుగుల గిరినాగు హల్‌చల్ చేసింది. బుసలు కొడుతూ అక్కడివారిని భయపెట్టింది. దీంతో హడలిపోయినవారు స్నేక్ క్యాచర్ పెచ్చేటి వెంకటేశ్‌కు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న వెంకటేశ్ ఆ పామును చాకచక్యంగా ప్రాణాలతో పట్టుకున్నారు. అనంతరం దానిని సమీపంలో జనసంచారం లేని మెట్ట ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ పామును చూసేందుకు పరిసర గ్రామాల వారు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

మట్టిలో మాణిక్యాలు

- ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన పేద విద్యార్థులు
- పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం
- ఆపై ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువులు

నర్సీపట్నం, ఏప్రిల్ 12 : వ్యవసాయ కూలీలు, రైతుల కుటుంబాలలో పుట్టిన పిల్లలు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అద్భుత ఫలితాలు సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఈ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకొని ఇంటర్ నర్సీపట్నంలోని పలు ప్రైవేటు కళాశాలలో చదివారు. గొలుగొండ మండలం కొత్తూరుకు చెందిన రైతు కె.నూకరాజు, మహాలక్ష్మి దంపతుల కుమార్తె త్రిపురాదేవి ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సంలో 463/470 మార్కులు సాధించింది. త్రిపురాదేవి చీడిగుమ్మల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చుదువుకొని ఇంటర్ నర్సీపట్నం ప్రగతి కళాశాలలో చదువుతోంది. నర్సీపట్నం గురందొరపాలెంలో ఎం.వీర్రాజు, భవానీల కుమార్తె నవ్య ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 983/1000 మార్కులు సాధించింది. నవ్య తండ్రి కూలిపని చేస్తుండగా, తల్లి ఇంటి వద్ద టైలరింగ్ చేసుకుంటూ కూతుర్ని చదివించుకుంటున్నారు. నర్సీపట్నంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. రావికమతం మండలం మేడివాడ గ్రామానికి చెందిన కె.దుర్గాగాయత్రి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 464 మార్కులు దక్కించుకుంది. ఈమె తండ్రి లోవరాజు వ్యవసాయ కూలీ, తల్లి సుజాత సాధారణ గృహిణి. మేడివాడ జడ్పీహెచ్‌లో పదో తరగతి వరకు చదువుకొని ఇంటర్ నర్సీపట్నం రిషి కళాశాలలో చదువుతోంది. నర్సీపట్నానికి చెందిన కె.యమున ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 440 మార్కులకు 433 మార్కులు సాధించింది. తండ్రి కె.శ్రీనివాస్ కూలా, తల్లి దుర్గ సాధారణ గృహిణి. యమున వేములపూడి మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుకొని ఇంటర్ శ్రీ విద్య జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఇలా పేదింటి బిడ్డలు ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించడంతో పలువురు ప్రశంసలతో ముంచెత్తారు.

పీటీడీ డిపోను సందర్శించిన ఈడీ



డిపో మేనేజర్‌కు ప్రశంసాపత్రం ఇస్తున్న ఈడీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 12: అనకాపల్లి పీటీడీ డిపోను విజయనగరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్. రవికుమార్ శుక్రవారం సందర్శించారు. సంక్రాంతి పండగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే అనకాపల్లి జిల్లా అత్యధికంగా ఆదాయం తెచ్చినందుకు పీటీడీ ఎండీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా డీపీటీవో కె. పద్మావతి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అదేవిధంగా జిల్లాలో సంక్రాంతి సందర్భంగా అనకాపల్లి డిపో అత్యధిక ఆదాయం సంపాదించినందుకు డిపో మేనేజర్ సుజాతకు, సూపర్‌వైజర్లకు ఈడీ రవికుమార్ ప్రశంసాపత్రాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జోన్ ఉన్నతాధికారి బి. అప్పలనాయుడు, డీపీటీవో పద్మావతి, డీఎం సుజాత, సూపర్‌వైజర్లు, గ్యారేజి సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

106 మంది వలంటీర్ల రాజీనామా

ఎలమంచిలి, ఏప్రిల్ 12: మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో శుక్రవారం 106 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను అందజేసినట్టు కమిషనర్ కొండలరావు తెలిపారు. పెదపల్లి, గొల్లలపాలెం వార్డులతో పాటు పలు వార్డుల్లోని వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను సచివాలయ అడ్మిన్‌లకు అందజేసినట్టు తెలిపారు.

రాంబిల్లిలో 21 మంది వలంటీర్లు..

రాంబిల్లి, ఏప్రిల్ 12: మండలంలోని పలు సచివాలయాల పరిధిలోని 21 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్టు ఎంపీడీవో వెంకటాచలం తెలిపారు. ఇప్పటికే 56 మంది వలంటీర్లు రాజీనామా చేశారని, ఇప్పుడు 21 మంది రాజీనామా చేశారన్నారు. వలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్టు ఎంపీడీవో తెలిపారు.

పూర్తయిన ఈవీఎం, వీవీ ప్యాడ్‌ల ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



కార్యక్రమంలో పాల్గొన్న రవి పట్టన్‌శెట్టి, అధికారులు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 12: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం), వీవీ ప్యాడ్‌ల మొదటి ర్యాండమైజేషన్ శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలోని జాతీయ నాలుగు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. చోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాలకు 315 వీవీ ప్యాడ్‌లు కేటాయించారు. మాడుగుల అసెంబ్లీకి 305 వీవీ ప్యాడ్‌లు, అనకాపల్లి నియోజకవర్గానికి 326 వీవీ ప్యాడ్‌లు కేటాయించారు. ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గానికి 319 వీవీ ప్యాడ్‌లు, పాయకరావుపేటకు 379 వీవీ ప్యాడ్స్, నర్సీపట్నం నియోజకవర్గానికి 340 వీవీ ప్యాడ్స్ కేటాయించారు. మొత్తం ఆరు నియోజకవర్గాలకుగాను 1984 వీవీ ప్యాడ్స్ కేటాయించారు. ఈ కార్యక్రమంలో జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ దయానిధి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరామ్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 455 మంది ఉత్తీర్ణత

▸▸ పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

పాడేరు రూరల్, ఏప్రిల్ 12: జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల్లో 455 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాసరావు తెలిపారు. జనరల్, ఒకేషనల్ నుంచి 815 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ పరీక్షలకు 304 మంది విద్యార్థులు హాజరుకాగా 97 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. అలాగే ఎంపీసీ గ్రూపులో 68 మందికి 16, బైపీసీలో 85 మందికి 36, హెచ్ఈసీలో 81 మందికి 21, సీఈసీలో 70 మందికి 24 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలకు 301 మంది విద్యార్థులు హాజరుకాగా 183 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎంపీసీ గ్రూపులో 68 మందికి 58, బైపీసీలో 95 మందికి 64, హెచ్ఈసీలో 72 మందికి 35, సీఈసీలో 67 మందికి 34 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఒకేషనల్‌లో మొదటి ఏడాది 110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 91 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు, ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ పరీక్షల్లో 100 మందికి 84 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలో ప్రభుత్వ, గురుకులం, కస్తూర్బా కళాశాలలో పరీక్షలు రాసిన ఇంటర్మీడియేట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 58 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 27 మందికి 21, ద్వితీయ సంవత్సరం 37 మందికి 33, టీడబ్ల్యూ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం 161 మందికి 120, ద్వితీయ సంవత్సరం 156 మందికి 133, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 193 మందికి 95, ద్వితీయ సంవత్సరం 224 మందికి 171 మంది ఉత్తీర్ణులయ్యారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలోని కస్తుర్బాగాంధీ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో 37 మందిలో 36 మంది పరీక్షలు రాయగా 32 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 192 మంది హాజరుకాగా 67 మంది ఉతీర్ణత సాధించగా 34 శాతం వచ్చింది. ద్వితీయ సంవత్సరంలో 107 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 80 మంది ఉతీర్ణత సాధించారు. 75 శాతం ఉతీర్ణత వచ్చిందని కళాశాల సిబ్బంది తెలిపారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి: మండలంలోని గురుకులం, కస్తూర్బాగాంధీ కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థినులు 97 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో గిరిజన సంక్షేమ శాఖ బాలిక జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 166 మందికి 162, ద్వితీయ సంవత్సరం 143 మందికి 141, కస్తూర్బాగాంధీ కళాశాలలో ప్రథమ సంవత్సరం 36 మందికి 32, ద్వితీయ సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు 47 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 232 మంది పరీక్షలు రాయగా 108 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితయ సంవత్సరం విద్యార్థులు 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 137 మంది పరీక్షలు రాయగా 119 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీ విద్యార్థిని కిముడు అనురాధ 740 మార్కులతో కళాశాల టాపర్‌గా, ఎంపీసీలో కిముడు అనుషాకుమారి 735 మార్కులు సాధించారు.

పెదబయలులో...

పెదబయలు: మండలంలో 400 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. గురుకుల కళాశాలలో 189 మంది పరీక్ష రాయగా 156 మంది ఉత్తీర్ణత సాధించారు. దివ్తఈయ సంవత్సరంలో 185 మందికి 173 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ కళాశాలలో ఒక్క బైపీసీ సబ్జెక్టుకు 78 మందిలో 69 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరానికి 38 మందిలో 31 మంది ఉత్తీర్ణులయ్యారు.

కొయ్యూరులో...

కొయ్యూరు: మండలంలో కాకరపాడు గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరానికిగాను 111 మంది పరీక్షకు హాజరుకాగా 93 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 72 మందిలో 65 మంది ఉత్తీర్ణులయ్యారు. గురుకుల కళాశాలకు సంబంధించి ద్వితీయ సంవత్సరం బైపీసీ గ్రూపులో పి.విజయ్ 850 మార్కులు సాధించి కళాశాల టాపరుగా నిలిచాడు. అలాగే కేజీబీవీలో ఎంపీసీ మొదటి సంవత్సరంలో 33 మందిలో 32 మంది పరీక్షకు హాజరు కాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంకు సంబంధించి 30 మందిలో 29 పరీక్షకు హాజరుకాగా 28 మంది ఉత్తీర్ణులయ్యారు.

కాలేజీ బస్సు బీభత్సం

▸▸ బైకులు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకుపోయిన వైనం

▸▸ బాలుడు మృతి.. పది మందికి గాయాలు ▸▸ పోలీసుల అదుపులో డ్రైవర్



ద్విచక్ర వాహనాలు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకువెళ్లిన బస్సు... (ఇన్‌సెట్‌లో) మృతుడు గౌస్ (ఫైల్)

కశింకోట, ఏప్రిల్ 12: అనకాపల్లి జిల్లా కశింకోట మండలం బయ్యవరం వద్ద శుక్రవారం అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు బీభత్సం సృష్టించింది. అతివేగంగా మూడు ద్విచక్ర వాహనాలు, కారు, టిఫిన్ సెంటర్ వ్యాన్‌పైకి దూసుకు పోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి సీఐ ఎం.వినోద్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

అనకాపల్లి నుంచి మాకవరపాలెం వెళుతున్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు శుక్రవారం ఉదయం 9.15 గంటల సమయంలో బయ్యవరం గ్రామ రెవెన్యూ పరిధిలో గల హెరిటేజ్ పాల ఉత్పత్తుల తయారీ కేంద్రం వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో అదుపుతప్పింది. రోడ్డుకు ఎడమ వైపు నిలిపి ఉన్న మూడు బైకులను, ఆపై ఒక కారును ఢీకొంది. విశాఖపట్నం జిల్లా పెందుర్తి నుంచి పిఠాపురం దర్గాకు కారులో వెళుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అల్పాహారం తీసుకునేందుకు బయ్యవరంలో టిఫిన్ సెంటర్ వద్ద ఆగారు. టిఫిన్ సెంటర్ వ్యాన్ మీదకు బస్సు దూసుకువెళ్లడంతో కారులో వచ్చిన షేక్ గౌస్ మొహిద్దీన్ (12) అక్కడికక్కడే మృతిచెందగా, ఆ సమయంలో అక్కడున్న పది మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో షేక్ గౌస్ మొహిద్దీన్ తండ్రి షేక్ రెహమాన్, తల్లి షేక్ మున్నీ బేగమ్, సోదరి షేక్ జరీనా బేగమ్, పెందుర్తికి చెందిన కారు డ్రైవర్ అహ్మద్, సయ్యద్ బాబ్జీ, టిఫిన్ సెంటర్ నడుపుతున్న గొల్లవిల్లి రమణమ్మ, ఇంకా బయ్యవరానికి చెందిన గొన్నాబత్తుల లక్ష్మి, తిర్రి అనిల్‌కుమార్, కరణం లక్ష్మణరావు, ఎస్.రామకృష్ణ (అనకాపల్లి) గాయపడ్డారు. వీరిలో రామకృష్ణ, మున్నీ బేగమ్‌ల పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలిసి సీఐ వినోద్‌బాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల్లో కొందరిని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి, మరికొందరిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

దర్గాకు వెళుతుండగా...

ప్రమాదంలో మృతిచెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ ఆరో తరగతి చదువుతున్నాడు. మొహిద్దీన్ పెద్ద అక్కకు ఈ నెల 26న వివాహం జరగనున్నది. ఈ నేపథ్యంలో దర్గాకు బయలుదేరారు. మార్గమధ్యంలో అల్పాహారానికి ఆగినప్పుడు ఊహించని విధంగా ప్రమాదం ముంచుకొచ్చింది.

క్షతగాత్రులకు పరామర్శ

బస్సు ప్రమాదంలో మృతిచెందిన గౌస్, వారి కుటుంబ సభ్యులను అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పరామర్శించారు. అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రి, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రభుత్వం మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

సాగునీటి కల్పనలోనూ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

చెక్‌డ్యామ్‌లకు మరమ్మతులు చేపట్టి, వాటి కిందనున్న భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టేదని రైతులు తెలిపారు. 2015 నుంచి 2020 సంవత్సరం వరకు ఐదేళ్లలో 391 చెక్‌డ్యామ్‌లను రూ.34 కోట్ల 98 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టారు. ఏజెన్సీలో 2015- 16 ఆర్థిక సంవత్సరంలో 58 చెక్‌డ్యామ్‌లకు రూ.4 కోట్ల 65 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. అలాగే 2016- 17లో 22 చెక్‌డ్యామ్‌లకు రూ.కోటి 95 లక్షలు, 2017- 18లో 133 చెక్‌డ్యామ్‌లకు రూ.8 కోట్ల 59 లక్షలు, 2018- 19లో 28 చెక్‌డ్యామ్‌లకు రూ.3 కోట్లతో, 2019- 2020 ఆర్థిక సంవత్సరంలో 150 చెక్‌డ్యామ్‌లకు రూ.16 కోట్ల 79 లక్షలతో మరమ్మతులు చేపట్టారు.

గిరిజనుల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

▸▸ ప్రజల సంక్షేమానికి బాబు ష్యూరిటీ

▸▸ పాడేరు ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి రమేశ్‌నాయుడు



జర్రెలలో గిరిజనులతో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

గూడెంకొత్తవీధి/సీలేరు/చింతపల్లి, ఏప్రిల్ 12: గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, అందువల్ల బాబు సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కిల్లు రమేశ్‌నాయుడు అన్నారు. మండలంలోని సీలేరు, వంచుల, జర్రెల, మొండిగెడ్డ గ్రామాలతో పాటు చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలతో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన పథకాలను ప్రజలు గమనించాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే యువగళం పేరిట 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగుల రూ.3 వేల భృతి, మహిళలకు నీటి కష్టాలు తీర్చేందుకు ఇంటింటికి కొళాయి, చదువుకునే ప్రతీ చిన్నారికి ఏడాదికి రూ.15 వేల నగదు ప్రోత్సాహం, దీపం పథకం ద్వారా ఏడాది ఉచితంగా మూడు సిలిండర్లు పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఆదివాసీ కోసం టీడీపీ ప్రవేశపెట్టి 15 పథకాలను రద్దు చేశారన్నారు. సంక్షేమమంటూనే అడ్డగోలు నిబంధనలను అమలులోకి తీసుకొచ్చి అర్హులను దూరం చేస్తున్నారన్నారు. గిరిజనులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అందాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, కమలం గురుపై ఓటేసి ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత గెలిపించాలని అభ్యర్థించారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో నిత్యావసర సరకుల ధరలు గణనీయంగా పెరగడంతో సామాన్య ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అలాగే ఏ ఒక వర్గం ప్రజలకు న్యాయం జరగలేదని, వైసీపీకి మరో అవకాశం ఇస్తే రాష్ట్రం, గిరిజనుల బతుకులు నాశనమైపోతాయని ప్రజలు గుర్తించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కూడా కృష్ణారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అడపా నరసింహమూర్తి, రామకృష్ణ, చిరంజీవి, నక్కా తిరుమలరావు, సన్యాసిరావు, వనముల రాము, లక్ష్మణ్, బాలు, అప్పలరాజు, మింది, త్రినాథ్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఏవోబీలో ముమ్మరంగా పోలీసు గాలింపు చర్యలు



ఆంధ్రా, ఒడిశా సరిహద్దు అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

సీలేరు, ఏప్రిల్ 12: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. జీకే వీధి మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా పేరొందిన సీలేరు పరిధిలో శుక్రవారం సీఆర్‌పీఎఫ్ స్పెషల్ పోలీసులు ఏరియా డామినేషన్, కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో మావోయిస్టుల నుంచి ఎటువంటి హింసాత్మక సంఘటనలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సరిహద్దుల్లోని జొన్నమామిడి, పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, జి.నేరేడుపల్లి, ఎస్.నేరేడుపల్లి తదితర ప్రాంతాల్లో పోలీసులు ముమ్మరంగా గాలించారు. సరిహద్దు గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ధారకొండ పంచాతీ పరిధిలోని పెదగంగవరం గ్రామంలో ఎన్నికలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అర్హులంతా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ముంచంగిపుట్టులో రాత్రి గస్తీ ముమ్మరం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో కొద్ది రోజులుగా రాత్రి గస్తీ ముమ్మరం చేశారు. ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిపై శుక్రవారం రాత్రి సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి ప్రయాణాల గమ్యాలపై ఆరా తీశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వాహన తనిఖీలను ముమ్మరం చేసినట్టు ఎస్ఐ తెలిపారు. అలాగే పోలింగ్ కేంద్రాల పరిధిలో బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృత తనిఖీలు చేపడుతున్నామన్నారు. మారుమూల గ్రామాలకు వెళ్లే ప్రజా ప్రతినిధులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: పాంగి



పెదకోటలో ఇల్లు కట్టుకుంటున్న కుటుంబీకులతో మాట్లాడుతున్న రాజారావు

అరకులోయ, ఏప్రిల్ 12: కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అరకు అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు అన్నారు. అనంతగిరి మండలంలో కివర్ల, పెదకోట, పినకోట పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులతో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు, గిరిజనులను కలిసి మాట్లాడారు. రాష్ట్రం, గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ప్రధానిగా నరేంద్రమోదీ గెలుపొందాలన్నారు. ఏజెన్సీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్రమే నిధులు మంజూరు చేస్తున్నదని, ఉచిత బియ్యం ఇస్తున్నది కూడా కేంద్ర ప్రభుత్వమేనని చెప్పారు. ఇంటింటి కుళాయిలకు జలజీవన్ పథకం కింద కేంద్రమే నిధులు ఇచ్చిందన్నారు. జనమన్ పథకం కింద అన్ని సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో అరకు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కొత్తపల్లి గీతను కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో మూడు పార్టీల నాయకులు అంటిపర్తి బుజ్జిబాబు, తడబారికి ఆనందరావు, దురియా నూకరాజు, భీమరాజు, గణేష్, చిరంజీవి, లక్ష్మణరావు, నవీన్, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏసీ హనుమంతురావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ హనుమంతురావు

పాడేరు రూరల్, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈబీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతురావు ఆదేశించారు. శుక్రవారం పాడేరు వచ్చిన ఆయన స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. అల్లూరి జిల్లాలో ఎక్కువ శాతం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్నందుకు సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్‌డీపీఎల్, నాటుసారా నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి జిల్లా యంత్రాంగం పనిచేయాలన్నారు. అనంతరం పాడేరు, అరకు ఎస్ఈబీ స్టేషన్‌లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎస్ఈబీ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఎస్ఈబీ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదానీకి పవర్ ప్రాజెక్టు అప్పగింతపై వైసీపీ సమాధానం చెప్పాలి

▸▸ సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చిన్నయ్యపడాల్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పాడేరు రూరల్, ఏప్రిల్ 12: అదానీ చేతికి ఏజెన్సీ హైడ్రో పవర్ ప్రాజెక్టు అప్పగింతపై అధికార పార్టీ సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గిరిజనులు సాగిస్తున్న పోరాటం అధికార, ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. భారతదేశంలో ఉన్న ఆదివాసీ ప్రాంతంలోని అడవులను అదానీకి అప్పగించడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. హైడ్రో ప్రాజెక్టుపై గిరిజనులు పోరాటం చేస్తుంటే అంతా అబద్ధమని అధికార పార్టీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తప్పించుకున్నారని, ఇప్పుడు నిజం నిర్ధారణ జరిగిందని ఆయన చెప్పారు. గిరిజనులకు ఇప్పుడైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో దొంగల్లా వస్తున్న వారిని గిరిజనులు ఓట్లతో తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎల్.సుందరరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

గొలుగొండ, ఏప్రిల్ 12 : చిన్నయ్యపాలెం పంచాయతీ అనంతసాగరం శివారున శుక్రవారం ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊట ధంసంస చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి బెల్లం ఊటను ధ్వసం చేయడంతో పాటు సారా తయారీకి సంబంధించి సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

కె.కోటపాడు, ఏప్రిల్ 12 : ఉత్తరాంధ్ర అంతటా పాడి పశువుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని విశాఖ డెయిరీ జీఎం ఏవీఎస్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని చౌడువాడలో గల విశాఖ డెయిరీ పాల కేంద్రం వద్ద చూడు నిలవని పాడి పశువులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విలువైన మందులను పలువురు పాడి రైతులకు అందజేశారు.

టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

నక్కపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని రాజయ్యపేట శివారు బోయపాడు నుంచి 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. శుక్రవారం మత్స్యకార నాయకులు పిక్కి శ్రీనివాసరావు, పిక్కి సత్తియ్య ఆధ్వర్యంలో మహిళలు, యువకులకు పార్టీ కండువాలు వేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అనిత పార్టీలోకి ఆహ్వానించారు.

గర్భిణులకు వైద్య సేవలు అంతంత మాత్రమే..

... 5వ పేజీ తరువాయి

ప్రసవం కష్టమైతే 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించాల్సి వస్తున్నది. దీంతో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణులు 50 కిలోమీటర్లు అంబులెన్సులో అతి కష్టమ్మీద ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది.

మూడు పోస్టులు మంజూరైనా..

చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో పేరుకే ముగ్గురు గైనికాలజిస్టులు ఉన్నారు. వైద్య సేవలందించేది ఒక్కరు మాత్రమే. రెండేళ్ల కిందట సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న స్థానిక ఆస్పత్రి ఏరియా ఆస్పత్రిగా స్థాయిని పెంచారు. దీంతో ఏరియా ఆస్పత్రికి సివిల్ అసిస్టెంట్ సర్జన్, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ క్యాడర్లలో మూడు గైనికాలజిస్టు పోస్టులు మంజూరయ్యాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్ క్యాడర్‌లో స్త్రీ వైద్యనిపుణులు సుధాశారద పనిచేస్తున్నారు. తాజాగా ఖాళీగా ఉన్న డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ క్యాడర్లలో శ్రీలత, ప్రవీణ నియమితులయ్యారు. ఈ ఇద్దరు వైద్యులు చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చేరినప్పటికి పాడేరు జిల్లా ఆస్పత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాలగా మార్పు చెందడంతో గైనికాలజిస్టు విభాగానికి షైదాన ప్రాంతాల నుంచి ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వచ్చారు. అయినప్పటికి చింతపల్లి ఏరియా ఆస్పత్రికి చెందిన గైనికాలజిస్టులను అదనంగా జిల్లా ఆస్పత్రిలో కొనసాగిస్తున్నారు. దీంతో ఏరియా ఆస్పత్రిలో మూడు గైనికాలజిస్టు పోస్టులు భర్తీ అయినా ఒక్కరు మాత్రమే సేవలందిస్తున్నారు.

పూర్తిస్థాయిలో గైనికాలజిస్టులను నియమించాలి



ఏరియా ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో గైనికాలజిస్టులను నియమించాలి. ఒకే ఒక్క వైద్యాధికారి విధుల్లో ఉండడం వల్ల చాలా ఇబ్బందిగా ఉంది. ఆమె సెలవు పెడితే గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందడం లేదు. ఏరియా ఆస్పత్రికి సుదూర ప్రాంతాల నుంచి గర్భిణులు వైద్య పరీక్షల కోసం వస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి డిప్యూటేషన్‌పై పాడేరులో పనిచేస్తున్న స్త్రీ వైద్యనిపుణులను చింతపల్లి పంపించాలి.

- బోనంగి పుష్పవతి, చింతపల్లి

☛ సంక్షిప్తంగా..

'వైసీపీకి అధికారం ఇస్తే ఆదివాసీలకు అపార నష్టం'

చింతపల్లి, ఏప్రిల్ 12: వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే ఆదివాసీలకు అపార నష్టం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సతక బుల్లిబాబు అన్నారు. గొందిపాకలు, సమగిరి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి గిరిజనులతో మాట్లాడారు. గిరిజనులు వ్యతిరేకిస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోకుండా పవర్ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చిందన్నారు. గిరిజన ఎమ్మెల్యే ఎంపీలు సైతం మౌనం వహిస్తున్నారన్నారు. జీవో నంబరు-3 పునరుద్ధరించలేదన్నారు. బోయవాల్మీకులను సైతం ఎస్టీ జాబితాలో చేర్చి ఆదివాసీ జాతికి అపార నష్టం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం పూనుకున్నదన్నారు. ప్రజలందరూ చైతన్యంతో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.వీరన్నపడాల్, ఎల్.వెంకటరమణ, ఎస్.కృష్ణపడాల్, వి.గోపీనాథ్, కె.సూరిబాబు, మోహన్‌రావు, ఎస్.గోపాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొయ్యూరు, ఏప్రిల్ 12: చిట్టింపాడు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల 2001-2002 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయంగా కలుసుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం పాఠశాలలో చదువుకుని వేర్వేరు ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారందరూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విందు ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేసేందుకు నిర్ణయించుకుని, అందుకు అవసరమైన సహకారం ఎలా అందించాలనే అంశంపై చర్చించుకున్నారు. అలాగే తమ బ్యాచ్‌లో ఎవరికి ఇబ్బందులు ఎదురైనా ఒకరికొకరు సహకరించుకునేందుకు వీలుగా గ్రూపు ఏర్పాటు చేసుకున్నట్టుగా వారు తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్టు

పెదబయలు, ఏప్రిల్ 12: మండలంలోని గలగండ పంచాయితీ సిరసపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్న పాంగి సత్యారావును అరెస్టు చేసినట్టు ఎస్ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు. గ్రామంలోని అనుమానిత గృహాల్లో సోదాలు చేయగా సత్యారావు ఇంటిలో పది లీటర్ల సారా పట్టుబడినట్టు చెప్పారు. అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. మండలంలో నిషేధిత మాదక ద్రవ్యాలను విక్రయించినా, రవాణా చేసినా కఠినమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

కొమ్మంగి పంచాయతీలో ఎనిమిది మంది వలంటీర్ల రాజీనామా

చింతపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని కొమ్మంగి పంచాయతీకి చెందిన ఎనిమిది మంది గ్రామ వలంటీర్లు శుక్రవారం ఉద్యోగానికి రాజీనామా చేశారు. వలంటీర్లు కొర్ర రమేశ్, కుడుముల అరుణ్ కుమార్, లోచలి రాంబాబు, పాంగి రాజేశ్వరి, జర్తా చిన్నారావు, జర్తా బాలయ్య, డిప్పల సత్తిబాబు, బత్తులు సింహాచలం వ్యక్తిగత కారణాల వల్ల ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో వీర సాయిబాబుకు రాజీనామా పత్రాలను అందజేశారు.

పది ఎకరాల్లో జీడిమామిడి తోట దగ్ధం



తుమ్మలపాలెం జీడిమామిడి తోటలో మంటలు

పాడేరు రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని మారుమూల దేవాపురం పంచాయతీ తుమ్మలపాలెం గ్రామంలో శుక్రవారం పది ఎకరాల జీడిమామిడి తోట అగ్నికి ఆహుతైంది. తుమ్మలపాలెం గ్రామానికి చెందిన పైడన్న దొర, నరసింహమూర్తి, పైడితల్లి, రాజులమ్మ తదితర రైతులకు చెందిన పది ఎకరాల జీడిమామిడి తోట ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో కాపునకు వచ్చి తోటలు కాలి బూడిదయ్యాయి. ప్రతి ఏటా జీడిమామిడి తోటలపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఈ ఏడాది పంట చేతికి వచ్చే సమయంలో ఈ విధంగా జరగడంతో ఆదాయాన్ని కోల్పోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆర్థికంగా తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.